క్లుప్తంగా

ఇంటి నిర్మాణాలు చేపట్టాలి



చిట్కుల్‌లో ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న హౌసింగ్ ఏఈ అరుణ్

చిలప్‌చెడ్(నర్సాపూర్): ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు తప్పనిసరిగా నిర్మాణాలు చేపట్టాలని హౌసింగ్ ఏఈ అరుణ్ అన్నారు. సోమవారం ఆయన మండల పరిధిలోని చిట్కుల్‌లో ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో 22 మంది లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేయగా.. 21 మంది ఇంటి నిర్మాణాలను ప్రారంభించారన్నారు. అయితే బేస్‌మెంట్ లెవల్ పూర్తయిన నిర్మాణాల కొలతలు తీసుకుని వాటి ఫొటోలు యాప్‌లో అప్‌లోడ్ చేశామన్నారు. ఇందులో కొంతమందికి మొదటి విడత డబ్బులు జమయ్యాయని, మిగిలిన ఇంటి నిర్మాణాన్ని సైతం ప్రారంభించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తిరుపతి పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా పుండరీకంగౌడ్



పుండరీకంగౌడ్‌కు పత్రాలు అందజేస్తున్న ఎన్నికల అధికారి

కౌడిపల్లి(నర్సాపూర్): రిటైర్డ్ ఉద్యోగులు సంఘం మండల అధ్యక్షుడిగా పుండరీకంగౌడ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం మండల రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఎన్నికలను ఆ సంఘం ఎన్నికల అధికారి హనుమంతరెడ్డి, పరిశీలకుడు శ్యాంసుందర్, జిల్లా అధ్యక్షుడు జగదీశ్‌చంద్ర, కార్యదర్శి సత్యనారాయణ ఆధ్వర్యంలో మండల సంఘం ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షుడిగా పుండరీకంగౌడ్, ప్రధాన కార్యదర్శిగా పోచయ్య, కోశాధికారిగా రాములుశర్మ, అసోసియేట్ అధ్యక్షుడిగా పురుషోత్తం, ఉపాధ్యక్షులుగా విఠల్, రత్నమ్మతో పాటు వెంకటయ్య, అరుణలత, గోపాల్‌రెడ్డి తదితరులను ఎన్నుకున్నారు.

ముదిరాజ్‌ల సమస్యలు పరిష్కరించాలి



నివాళులర్పిస్తున్న నాయకులు

పెద్దశంకరంపేట(మెదక్): ముదిరాజ్‌ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు పున్నయ్య అన్నారు. సోమవారం ముదిరాజ్ మహాసభ వ్యవస్థాపకుడు కొరివి కృష్ణ స్వామి ముదిరాజ్ జయంతి సందర్భంగా మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు రవీందర్, సంగమేశ్వర్, మానిక్యం, సాయిలు, ప్రేమ్‌కుమార్, సర్వేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడలు ముఖ్యం



ఎస్‌జీఎఫ్ క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న అధికారులు

పెద్దశంకరంపేట(మెదక్): క్రీడా పోటీల్లో జిల్లా, రాష్ట్ర స్థాయిలో విద్యార్థులు సత్తాచాటాలని తహసీల్దార్ శ్రీనివాస్ అన్నారు. సోమవారం పెద్దశంకరంపేటలో ఎస్‌జీఎఫ్ మండల స్థాయి క్రీడా పోటీలను ఎంఈఓ వెంకటేశంతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమానికి ప్రత్యేకంగా కృషి చేస్తుందన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను వినియోగించుకోవాలన్నారు. చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ సరిత, హెచ్‌ఎంలు శ్రావణ్, శిరీష, కుమార్, మారుతి, ఉపాధ్యాయులు ఆనంద్, ప్రసన్నకుమార్, అశోక్‌రెడ్డి, సత్యకుమార్ తదితరులున్నారు.

బీఆర్‌ఎస్ అధ్యక్షుడిగా పురుషోత్తం

కౌడిపల్లి(నర్సాపూర్): బీఆర్‌ఎస్ మండల కమిటీని సోమవారం మాజీ సీడీసీ చైర్మన్ దుర్గారెడ్డి, యూత్ నాయకులు పోల నవీన్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బీస పురుషోత్తం, ఉపాధ్యక్షులుగా సంగప్ప, వడ్ల శేఖర్, ప్రధాన కార్యదర్శిగా హరీష్‌తోపాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు రాజిరెడ్డి, నవీన్, సందీప్, రవి, మల్లికార్జున్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎదురుచూపులే!



నార్సింగిలోని ఆగ్రోస్ కేంద్రం వద్ద క్యూలో నిల్చున్న రైతులు



నర్సాపూర్: జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న రైతులతో మాట్లాడుతున్న పోలీసులు



కౌడిపల్లి యూరియా కోసం తరలివచ్చిన రైతులు

- తీరని యూరియా కష్టాలు
- గంటల తరబడి క్యూలోనే
- ఇబ్బందులు పడుతున్న రైతులు

చిన్నశంకరంపేట(మెదక్): యూరియా కోసం రైతులకు ఎదురుచూపులు తప్పడం లేదు. సోమవారం మండలంలోని చందంపేట సహకార సంఘం వద్దకు యూరియా వచ్చిందని తెలుసుకున్న రైతులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకొని క్యూలో నిల్చున్నారు. రైతులు ఒక్కసారిగా కేంద్రానికి చేరుకోవడంతో ముందుగా టోకెన్లు అందించారు. అనంతరం రైతుకు ఒక్కటి చొప్పున యూరియా బస్తా అందిస్తామని అధికారులు చెప్పడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు రెండు బస్తాలు అందించాలని కొంతమంది రైతులు కోరారు. అలాగే నార్సింగి మండల కేంద్రంలోని ఆగ్రోస్ కేంద్రంలో యూరియా కోసం రైతులు బారులుతీరారు.

నర్సాపూర్: స్థానిక చౌరస్తాలో యూరియా కోసం రైతులు సోమవారం జాతీయ రహదారిపై రాస్తారోకో చేపట్టారు. యూరియా కోసం స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వద్దకు చేరుకున్నప్పటికి యూరియా లభించకపోవడంతో రైతులు జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా సీఎం డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్‌ఐ లింగం అక్కడికి చేరుకుని రాస్తారోకో విరమించాలని రైతులను కోరారు. అయితే తమకు యూరియా ఇచ్చే వరకు కదిలేది లేదని చెప్పడంతో ఆయన వ్యవసాయాధికారులతో మాట్లాడి నచ్చజెప్పారు. నర్సాపూర్‌కు రెండు లారీల యూరియా వస్తుందని తెలపడంతో రాస్తారోకో రాస్తారోకో విరమించారు.

కౌడిపల్లి(నర్సాపూర్): రైతులకు యూరియా గోస తప్పడంలేదు. ఉదయం నుంచి సాయంత్రం వరకు టోకెన్ల కోసం పడిగాపులు కాస్తూ అవస్థలు పడుతున్నారు. సోమవారం మండలంలోని మహమ్మద్‌నగర్ సొసైటీకి యూరియా చేరింది. దీంతో మండల కేంద్రంలోని రైతువేదికలో టోకెన్ల కోసం పడిగాపులు చేశారు. ఈ మేరకు ఏఓ స్వప్న, సొసైటీ సీఈఓ దుర్గాగౌడ్ పోలీస్‌ల ఆధ్వర్యంలో టోకెన్లు అందజేశారు.

‘హల్దీవాగు’ పనుల్లో జాప్యం వద్దు

కలెక్టర్ రాహుల్‌రాజ్



హల్దీవాగుపై నిలిచిన వంతెన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

సాక్షి ఎఫెక్ట్

తూప్రాన్: మండలంలోని వెంకటరత్నాపూర్ గ్రామ సమీపంలో హల్దీవాగుపై నిలిచిన వంతెన నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదేశించారు. సోమవారం సాక్షి దినపత్రికలో గత తొమ్మిదేళ్లుగా కొనసాగుతున్న నిర్మాణం పనులపై ‘ఆగుతూ..సాగుతూ!’ అనే కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి కలెక్టర్ స్పందించారు. ఈ మేరకు వెంకటరత్నాపూర్ హల్దీవాగుపై వంతెన నిర్మాణం పనులను సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. వంతెన నిర్మాణం జాప్యానికి గల కారణాలను ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. వెంటనే వంతెన నిర్మాణ పనులు పూర్తి చేసి ఉపయోగంలోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. అనంతరం గ్రామంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. వర్షాకాలంలో సీజన్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. కలెక్టర్ వెంట పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు, రెవెన్యూ, ఆయా శాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

పాఠశాలకు సామగ్రి అందజేత



విష్ణువర్ధన్‌రెడ్డిని సన్మానిస్తున్న రాజిరెడ్డి, సుహాసినిరెడ్డి

చిలప్‌చెడ్(నర్సాపూర్): సమాజ సేవ చేసే సంకల్ప బలం చాల గొప్పదని జిల్లా గ్రంథాలయ చైర్‌పర్సన్ సుహాసిని రెడ్డి అన్నారు. మండల పరిధిలోని చిటుకుల్ ప్రాథమిక పాఠశాలకు తారా విష్ణు వర్దన్‌రెడ్డి.. తన తండ్రి జ్ఞాపకార్థం తార అంజిరెడ్డి సేవాసమితి తరపున సుమారు రూ. 1.30 లక్షల వేల విలువైన సామగ్రి అందజేయడం అభినందనీయమన్నారు. అదేవిధంగా గ్రామ పంచాయతీకి బల్బులు సైతం అందించారన్నారు. విష్ణువర్ధన్‌రెడ్డి అందించిన సామగ్రిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఆమె నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ రాజిరెడ్డితో కలిసి ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నారాయణరెడ్డి, వైస్ ఎంపీపీ విశ్వంభర, సొసైటీ డైరక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు విఠల్‌రెడ్డి, భూమయ్య, అఖిల్, వెంకట్‌రెడ్డి, హెచ్‌ఎం రాంచంద్రారెడ్డి, పంచాయతీ కార్యదర్శి తిరుపతి, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ ఏర్పాటు అభినందనీయం

నర్సాపూర్ రూరల్: కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆవుల రాజిరెడ్డి సొంత నిధులతో ఆర్‌ఓ ప్లాంట్ ఏర్పాటు చేయించడం అభినందనీయమని జిల్లా గ్రంథాలయం సంస్థ చైర్ పర్సన్ సుహాసిని రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆర్‌ఓ ప్లాంట్‌ను ఆయనతో కలిసి ప్రారంభించారు.

నానో యూరియాపై అవగాహన



రామోజీపల్లిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

పెద్దశంకరంపేట (మెదక్): రైతులు నానో యూరియాపై అవగాహన పెంచుకోవాలని మండల ఇన్‌చార్జి వ్యవసాయ అధికారి కృష్ణ అన్నారు. సోమవారం మండలంలోని రామోజీపల్లిలో రైతులకు నానో యూరియాపై అవగాహన కల్పించారు. ఎక్కువగా ఎరువులను వినియోగించడంతో పంటల భూసారం దెబ్బతింటుందని, ప్రతి ఏటా పంటల మార్పిడి చేసుకోవాలని సూచించారు. దీంతో పాటు ఆయిల్‌పామ్‌పై రైతులు అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ పంటపై ప్రభుత్వం 90శాతం సబ్సిడీ అందజేస్తుందని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో అఖిల్, మమత, వినీత్, మాజీ ఎంపీపీ రాజు, లివ్ ఫామ్ కంపెనీ అసిస్టెంట్ మేనేజర్ జాన్సన్, రైతులు పాల్గొన్నారు.

నానో యూరియాతో అధిక దిగుబడి

నర్సాపూర్ రూరల్: నానో యూరియాతో అధిక దిగుబడి ఉంటుందని మండల వ్యవసాయ శాఖ అధికారి దీపిక రైతులకు సూచించారు. సోమవారం మండలంలోని కాగజ్ మద్దూర్‌లో శంకర్ రైతు పొలంలో నానో యూరియా పిచికారీ చేయించి రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం వరి, పత్తి పంటలకు వాడే మోతాదును వివరించారు. కార్యక్రమంలో ఏఈఓ లక్ష్మీ, ఆత్మ బీటీఎం హరిత, రైతులు పాల్గొన్నారు.

‘ఫౌతీ’కి తిప్పలు!

- ఆలస్యం ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించిన ఫిర్యాదుదారుడు
- కేసు పెడతామంటూ ఆర్‌ఐ బెదిరింపులు



ఫిర్యాదు చేసేందుకు వచ్చిన బాధితుడు

పాపన్నపేట(మెదక్): తల్లి పేరిట ఉన్న భూమిని తన పేరు మీద ఫౌతీ చేయాలని రెవెన్యూ అధికారులు ఆశ్రయించగా.. తమపై కేసు పెడతామని బెదిరిస్తున్నారని టేక్మాల్ మండలంలోని ముత్యాల బంధం తండాకు చెందిన రమావత్ సక్రూ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. ఇటీవల తన తల్లి రాం మృతి చెందడంతో మండలంలోని లింగాయపల్లిలో ఆమె పేరిట ఉన్న భూమిని తన పేరిట ఫౌతీ చేయాలని రెవెన్యూ అధికారులను సంప్రదించినట్లు తెలిపారు. ఇందులో భాగంగానే ఈనెల 12న స్లాట్ బుక్ చేయగా.. విచారణ పేరిట రెవెన్యు ఇన్‌స్పెక్టర్ కార్యాలయం చుట్టూ తిప్పుతున్నాడని ఆరోపించారు. అయితే ఫౌతీ ఎందుకు చేయడం లేదని ప్రశ్నించగా.. కేసు పెడతానని బెదిరిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై సదరు ఆర్‌ఐని వివరణ కోరగా.. ఫిర్యాదుదారుడు తనపై అమర్యాదగా ప్రవర్తించాడని తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో మేలు

తూప్రాన్: సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు మేలు చేస్తుందని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణానికి చెందిన తిమ్మపురం వెంకటమ్మకు సీఎంఆర్‌ఎఫ్ ద్వారా మంజూరైన రూ.60 వేల చెక్కును కాంగ్రెస్ నాయకులతో కలిసి అందజేశారు. ఈ కార్యక్రమంలో నాచారం దేవస్థానం చైర్మన్ పల్లేర్ల రవీందర్‌గుప్త, నాయకులు కృష్ణ, నాగరాజు, రవీందర్‌రెడ్డి, ఆకుల రవి, భగవన్‌రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన పురం మహేశ్

మనోహరాబాద్(తూప్రాన్): బీజేపీ జిల్లా నాయకుడు పురం మహేశ్ పుట్టినరోజు సందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సత్కరించి ఆశీస్సులు తీసుకున్నారు. కార్యక్రమంలో మెదక్ పార్లమెంట్ కన్వీనర్ రామ్మోహన్‌గౌడ్, సిద్దిపేట జిల్లా కన్వీనర్ నరేందర్‌చారి, మండల అధ్యక్షుడు వెంకటేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రాజగోపురంలో దుర్గమ్మ పూజలు

పాపన్నపేట(మెదక్): ఏడుపాయల వన దుర్గమ్మ పూజలు సోమవారం రాజగోపురంలో కొనసాగాయి. ఘనపురం ప్రాజెక్టుపై నుంచి 16,220 క్యూసెక్కుల నీరు దిగువకు ప్రవహిస్తుండటంతో ఆలయం ముందు బ్రిడ్జి కింద నుంచి నీరు ప్రవహిస్తుంది. దీంతో 12 రోజులుగా ఆలయం మూసివేసి రాజగోపురంలో పూజలు చేస్తున్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని నగరం తండా గ్రామ శివారులో పేకాట ఆడుతున్న కొంతమందిని సోమవారం పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు పల్లపు శ్రీనివాస్, కొమ్మట బాబు, పల్లపు మహేందర్, గుగుల్ గోపి, గుర్రాల బాలరాజు, కొమ్మాట వెంకటేశ్, పల్లపు లక్ష్మణ్, గుగులోత్ రవిలు పేకాట ఆడుతున్నట్లు తెలుసుకొని దాడి చేశారు. అనంతరం వారి నుంచి 5 బైకులు, 5 సెల్ ఫోన్లు, రూ.15,040 సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ రాజేష్ హెచ్చరికలు జారీ చేశారు.

డాక్టరేట్ పొందిన పూర్వవిద్యార్థికి సన్మానం



వేదశ్రీని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

చిన్నశంకరంపేట(మెదక్): ఓయూలో డాక్టరేట్ అందుకున్న మండలంలోని చందంపేట జెడ్పీ పాఠశాల పూర్వ విద్యార్థిని వేదశ్రీని సోమవారం ఉపాధ్యాయులు సన్మానించారు. రామాయంపేట ప్రభుత్వ బాలుర పాఠశాలలో హిందీ ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్న వేదశ్రీ.. ‘అరుణ్ కమల్ ఔర్ మంగోశ్ డబ్రాల్‌కే కావ్యాక సామాజిక అధ్యాయన్’ హిందీ కవిత్వానికి గాను డాక్టరేట్ పొందింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామస్తులతోపాటు పాఠశాల ఉపాధ్యాయులు సన్మానించడం గౌరవంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు, మాజీ ఎంపీటీసీ శివకుమార్, మాజీ సర్పంచ్ స్వామిరాజ్ ఉన్నారు.

జర్నలిస్టుల శ్రేయస్సుకు కృషి: ఐజేయూ



మాట్లాడుతున్న శంకర్ దయాల్‌చారి

రామాయంపేట(మెదక్): జర్నలిస్టుల శ్రేయస్సు కోసం టీయూడబ్ల్యూజే కృషి చేస్తుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు శంకర్ దయాల్ చారి పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా సభ్యత్వాల సేకరణలో భాగంగా సోమవారం రామాయంపేటలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వృత్తిపరంగా తాము ఏ పార్టీకి మద్దతు ఇవ్వమన్నారు. ప్రభుత్వపరంగా రావాల్సిన సదుపాయాలు దక్కేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీనివాసశర్మ, సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సంతోష్ కుమార్, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడు నాగరాజు, సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శి మిన్‌పూర్ శ్రీనివాస్, ఐజేయూ సభ్యులు అశోక్, జిల్లా కోశాధికారి దేవరాజు, స్థానిక ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసులు పరిష్కరించాలి

డీఎస్పీ ప్రసన్నకుమార్



పోలీసులకు సూచనలు చేస్తున్న డీఎస్పీ

రేగోడ్(మెదక్): పెండింగ్‌లో ఉన్న కేసులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్ ఆదేశించారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను సోమవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులు, పరిసరాలను పరిశీలించారు. అనంతరం కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులపై మర్యాదగా మాట్లాడి సమస్యలు పరిష్కరించేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో అల్లాదుర్గం సీఐ రేణుకారెడ్డి, స్థానిక ఎస్‌ఐ పోచయ్య ఉన్నారు.

విద్యతోనే బంగారు భవిష్యత్



మాట్లాడుతున్న ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి

కౌడిపల్లి(నర్సాపూర్): విద్యతోనే బంగారు భవిష్యత్ సాధ్యమని ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి, ఎంజేపీ గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ జిల్లా కన్వీనర్ హరిబాబు తెలిపారు. సోమవారం మండల పరిధిలోని తునికి ఎంజేపీ బీసీ గురుకుల పాఠశాలలో ఫ్రెషర్స్ పార్టీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో శ్రద్ధగా చదువుకోవాలని తెలిపారు. మొబైల్‌కు బానిస కాకుండా చదువుపై దృష్టి సారించాలన్నారు. అలాగే ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయన్నారు. అనంతరం పలువురు విద్యార్థులు ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. ఈ కార్యక్రమంలో ఏటీపీలు జయరాజ్, జాన్‌వెస్లీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మట్టి వినాయక విగ్రహాల పంపిణీ



విగ్రహాలు అందజేస్తున్న కమిషనర్ దేవేందర్

రామాయంపేట(మెదక్): పర్యావరణానికి మేలు చేసే మట్టి వినాయక విగ్రహాలను పూజించాలని పట్టణ ప్రజలకు మున్సిపల్ కమిషనర్ దేవేందర్ సూచించారు. సోమవారం ఆయన కార్యాలయంలో మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. పట్టణంలోని 12 వార్డుల్లో పంపిణీ చేసేందుకు వీలుగా ఆయా వార్డుల అధికారులకు, మహిళా రిసోర్సు పర్సన్లకు విగ్రహాలను అందజేసినట్లు తెలిపారు.

సంక్షిప్త వార్తలు

◆ ధ్వజస్తంభం ఏర్పాటుకు విరాళం

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని లింగోజిగూడ తండాలో జగదాంబ సంత్ సేవాలాల్ గుడి నిర్మాణంలో భాగంగా ధ్వజస్తంభం ఏర్పాటుకు దాత విరాళం అందజేశారు. ఈ మేరకు మంగళవారం పిల్లుట్లకి చెందిన చంద్రశేఖర్‌రెడ్డి రూ.60 వేల విరాళాన్ని ఆలయ నిర్వాహకులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మురళీగౌడ్, సతీష్, లక్ష్మయ్య, లాలు, గోపాల్, బాబు, వేణు, శ్రీనివాస్, రాజు, పాండు ఉన్నారు.

◆ మహాధర్నా వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

వెల్దుర్తి(తూప్రాన్): సీపీఎస్ రద్దు చేయాలని పీఆర్టీయూ టీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వెల్దుర్తి ఉన్నత పాఠశాలలో సెప్టెంబర్ 1న ఇందిరాపార్క్ వద్ద తలపెట్టిన మహాధర్నా వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ సీతారాం, మండల అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి నవీన్‌కుమార్, అమూల్య తదితరులు పాల్గొన్నారు.

◆ బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి

హవేళిఘణాపూర్(మెదక్): మెదక్ మండలంలోని మాచవరంలో లక్ష్మయ్య గుడిసె దగ్ధమైంది. ఈ మేరకు బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు మల్లేశ్‌గౌడ్ సోమవారం డిమాండ్ చేశారు.

◆ రైతులకు పరిహారం చెల్లించాలి

శివ్వంపేట(నర్సాపూర్): భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలకు ప్రభుత్వం పరిహారం చెల్లించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు మల్లేష్‌గౌడ్ అన్నారు. ఈ మేరకు సోమవారం డిప్యూటీ తహసీల్దార్ షఫీయొద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కొండల్‌రావ్, రవి, అశోక్, భిక్షపతి, వినోద్, గోప్యానాయక్, నర్సారెడ్డి, భాస్కర్, తదితరులు ఉన్నారు.

కమీషన్‌పై రేషన్ డీలర్ల నిరసన



చిలప్‌చెడ్: డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న రేషన్ డీలర్లు



తూప్రాన్: తహసీల్దార్‌కు వినతి ప్రతం అందజేస్తున్న రేషన్ డీలర్లు

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రేషన్ డీలర్లు తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం నిరసన చేపట్టారు. 5 నెలల కాలానికి సంబంధించిన కమీషన్ డబ్బులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం గిర్దావర్ నర్సింగ్‌యాదవ్‌కు వినతి పత్రం అందజేశారు.

వినతి పత్రం అందజేత

చేగుంట(తూప్రాన్): రేషన్ డీలర్ల పెండింగ్ కమీషన్ ఇవ్వాలని మండల రేషన్ డీలర్ల సంఘం ఆధ్వర్యంలో తహశీల్దార్ శ్రీకాంత్‌కు సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ వినతి పత్రం అందించారు.

డీలర్ల సమస్యలు పరిష్కరించాలి

శివ్వంపేట(నర్సాపూర్): రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలని జిల్లా రేషన్ డీలర్ల సంఘం మండల అధ్యక్షుడు పాపయ్యచారి, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌గుప్తా, గణేష్ అన్నారు.అనంతరం డిప్యూటీ తహసీల్దార్ షఫీయొద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు.

పెండింగ్ కమీషన్ చెల్లించాలి

పెద్దశంకరంపేట(మెదక్): పెండింగ్‌లో ఉన్న రేషన్ డీలర్ల కమీషన్‌ను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని కోరుతూ మండల రేషన్ డీలర్ల సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ శ్రీనివాస్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు

మా కమీషన్ ఇప్పించండి సారూ.

చిలప్‌చెడ్(నర్సాపూర్): రేషన డీలర్లకు కమీషన్ త్వరగా ఇప్పించండి సారూ.. అంటూ మండల రేషన్ డీలర్లు సోమవారం డిప్యూటీ తహసీల్దార్ సింధూజకు వినతిపత్రం అందజేశారు.

రేషన్ డీలర్‌ల ఆందోళన

మనోహరాబాద్(తూప్రాన్): రేషన్ డీలర్ల కమీషన్ ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఆ సంఘం నాయకులు మనోహరాబాద్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు.

వెంటనే విడుదల చేయాలి

కొల్చారం(నర్సాపూర్): రేషన్ డీలర్లకు రావాల్సిన కమీషన్ డబ్బులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని జిల్లా రేషన్ డీలర్ల సంఘం గౌరవ అధ్యక్షుడు ప్రభాకర్ గుప్త డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాస్ చారికి వినతి అందజేశారు

వినతి పత్రం

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని రేషన్ డీలర్లు సోమవారం తహసీల్దార్ మాలతిని కలిసి 5 నెలల రేషన్ కమిషన్ రావాలని వినతి పత్రం అందించారు

రేషన్ డీలర్ల నిరసన

తూప్రాన్: రాష్ట్ర ప్రభుత్వం రేషన్ డీలర్లకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ సోమవారం మండలంలోని రేషన్ డీలర్లు తహసీల్దార్ కార్యాలయంలో నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు.